ప్రజాశక్తి
బుధవారం 4 సెప్టెంబర్ 2024 5 విజయనగరం



వరద బాధితుల కోసం నేడు విరాళాల సేకరణ : సిపిఎం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయవాడ వరద బాధితుల కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ప్రజల నుంచి బుధవారం విరాళాలు సేకరించనున్నట్టు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా తమకు తోచిన సాయాన్ని అందజేయాలని విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలకు విజయవాడ జలదిగ్బంధంలో ఉందని, పేద, ధనిక అనే తేడా లేకుండా అక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. వారంతా వెంటనే తేరుకోవాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. విరాళాల సేకరణలో ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజనులు, పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్ల నిరసనలు
- రాత పూర్వక హామీలకు జీవోలు ఇవ్వాలి
- వైద్యులకు, సిబ్బందికి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-విలేకర్లు

ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి సమస్యలు పరిష్కరించాలని, గత ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక హామీలకు జీవోలు ఇవ్వాలని, డాక్టర్లకు, వైద్యఆరోగ్యశాఖ సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆశాడే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు పిహెచ్‌సిల వద్ద ఆశావర్కర్లు నల్లరిబ్బన్లు ధరించి ధర్నాలు చేశారు. గంట్యాడ పిహెచ్‌సి వద్ద యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి ఆధ్వర్యాన, మెరకముడిదాం పిహెచ్‌సి వద్ద సిఐటియు నాయకులు టివి రమణ, ఎ.గౌరునాయుడు ఆధ్వర్యాన, రాకోడు పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రిటైర్మెంట్ వయసు 62ఏళ్లకు పెంచాలని, జీతాలు పెంచాలని, పని భారం తగ్గించాలని కోరారు. కోల్‌కత్తాలోని ఆర్‌జికార్ మెడికల్ కళాశాల విద్యార్థిని హతమార్చిని నిందితులను కఠినంగా శిక్షించాలని నినదించారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యాధికారులకు, హెచ్‌విలకు వినతులు అందజేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

విజయనగరంటౌన్ : విజయనగరంలోని అన్ని అర్బన్ హెల్త్ సెంటర్ల వద్ద యూనియన్ నాయకులు మహాలక్ష్మి, పద్మ , వాసవి, కనకమహాలక్ష్మి, అప్పయ్యమ్మ, ఆదిలక్ష్మి నాయకత్వంలో నిరసన తెలిపారు.

మెంటాడ : ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి ఆధ్వర్యంలో



మెంటాడ : పిహెచ్‌సి నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు


కొత్తవలస : వియ్యంపేట వైద్యాధికారికి వినతినిస్తున్న సిఐటియు నాయకులు

స్థానిక పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని హ త్య చార ఘటనలో నిందితులకు కఠినంగా శిక్షించాలని, మహిళా చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలని, డాక్టర్స్ కు సంబంధించి ప్రత్యేకమైన రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యాధికారికి


విజయనగరంటౌన్ : రాకోడు పిహెచ్‌సి వద్ద ఆశావర్కర్ల నిరసన

వినతినిచ్చారు. యూనియన్ నాయకులు సత్యవతి, సుజాత, ఆదిలక్ష్మి, రవణమ్మ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : సిఐటియు ఆధ్వర్యంలో జరజాపు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారికి ఆశా వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐ టియు నాయకులు కిల్లంపల్లి రామారావు మాట్లాడారు. యూనియన్ నాయకులు కొండేటి పద్మ, ఆర్. రాధ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఆశా వర్కర్స్ వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని బొబ్బిలి పిపి యూనిట్ డాక్టర్ సంతోషి కుమారికి వినతి పత్రం ఇచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్ శాంతమ్మ, మీసాల లక్ష్మి, సంతు, ఆశాలు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని పెరుమాలి పిహెచ్‌సి వద్ద సిఐటియు మండల కార్యదర్శి ఎస్ గోపాలం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌కు వినతి పత్రం సమర్పించారు.

శృంగవరపుకోట : కొట్టాం పిహెచ్‌సి వద్ద ఆశావర్కర్లు నిరసన


గంట్యాడ : పిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు, నాయకులు

తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడారు. అనంతరం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ జె. హారిక, డాక్టర్ శిరీషలకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విమల, సామమ్మ, విజయ, సునీత, కృష్ణవేణి, రవణమ్మ, లక్ష్మి పార్వతి, అనురాధ, రాజేశ్వరి పాల్గొన్నారు.

కొత్తవలస : వియ్యంపేట పిహెచ్ సి ఆశా కార్యకర్తలు ధర్నా చేపట్టారు. అనంతరం పిహెచ్‌సి వైద్యాధికారికి వినతి పత్రం అందించారు. నాయకులు గాడి అప్పారావు మాట్లాడారు.

రేగిడి : మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు, రాజాం మండల నాయకులు ఎం.త్రినాథ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారానికి పోరాటాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వైద్యాధికారి చలమయ్యకు వినతి అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు సరస్వతి లక్ష్మి ఉన్నారు.

సంతకవిటి : ఆశా వర్కర్స్ వేతనాలు పెంచాలని కోరుతూ స్థానిక పిహెచ్‌సి వద్ద నిరసన తెలిపారు. అనంతరం డాక్టర్ ప్రశాంత్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు రవణమ్మ, లావణ్య, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాజాం : మండలంలోని పొగిరి పిహెచ్‌సి వద్ద ఆశావర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడారు. పనిభారంతో అల్లాడుతున్న ఆశా వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం వైద్యాధికారి భార్గవికి వినతి అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు దుర్గా, సిఐటియు రాజాం నాయకులు పోరెడ్డి విశ్వనాథం ఆశాలు పాల్గొన్నారు.


రాజాం : పొగిరి పిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

ఇక విద్యుత్తు స్మార్టు మీటర్లు

- తొలుత ప్రభుత్వ కార్యాలయాలు.. తరువాత సామాన్యుల ఇళ్లకు
- కార్పొరేట్ల కోసం డేటా సేకరణే అసలు లక్ష్యమా?
- గల్లంతు కానున్న స్కిల్డ్, సెమీస్కిల్డ్ ఉద్యోగాలు
- ప్రీపెయిడ్‌తో వ్యవసాయ పంపుసెట్లకు ఆటంకం



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అభివృద్ధిలో అత్యంత వెనుకబడిన విజయనగరం జిల్లాలోనూ విద్యుత్ స్మార్ట్‌మీటర్లు ఏర్పాట్లు మొదలైంది. అమలు సులువు చేసుకునేందుకు తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు అమరుస్తున్నారు. ఆ తరువాత క్రమంగా వ్యవసాయ పంపుసెట్లు, సామాన్యుల ఇళ్లకు కూడా ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ విధానం వెనుక కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు, ప్రజలకు తెలియకుండానే వారిపై భారాలు మోపడం వంటి కుట్రలు దాగివున్నాయి. గత ఐదేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వద్ద అప్పుల కోసం లాలూచీపడిన వైసిపి ప్రభుత్వం విద్యుత్ రంగంలో ప్రైవేటు సంస్కరణలకు అమలుకు పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. ఇటీవల ప్రభుత్వం మారినప్పటికీ ఇటీవల ఎన్నికల్లో బిజెపితో కూటమి కట్టిన సిఎం చంద్రబాబు కూడా విద్యుత్ రంగంలో తీసుకొచ్చిన నాటి విధానాలు యథాతథంగా ముందుకు తీసుకెళ్లేం దుకు తహతహలాడుతున్నారు. అందులో భాగంగా ఇప్పటికే పలు జిల్లాల్లో స్మార్ట్ మీటర్లు అమర్చిన ప్రభుత్వం తాజాగా ఉమ్మడి విజయ నగరం జిల్లాలో స్మార్ట్‌మీటర్లు అమలుకు మరో అడుగు వేసింది. ఈ ఉమ్మడి జిల్లాలో సుమారు 9,73,000 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహ వినియోగదారులు అత్యధికంగా 7,99,899 వరకు ఉన్నారు. గృహేతర (కర్షియల్) సర్వీసులు 91,731 ఉన్నాయి. 4,851 పరిశ్రమలు, 20,938 కుటీర పరిశ్రమల సర్వీసులు, 684 హెచ్‌డి కనెక్షన్లు ఉన్నాయి. ఇవి కాకుండా 55,778 వ్యవసాయ పంపుసెట్ కనెక్షన్లు కూడా ఉన్నాయి. వీరందరికీ విద్యుత్ ఉద్యోగులు మాన్యువల్ లేదా స్కానర్ ద్వారా బిల్లులు తీసి అందజేస్తున్నారు. స్మార్ట్‌మీటర్లు పూర్తిగా అమర్చాక సెల్‌ఫోన్ల రీఛార్జి మాదిరిగా ప్రీపెయిడ్ విధానం అమల్లోకి రానుంది. అది అమల్లోకి వచ్చిన తరువాత నిర్దేశించిన విద్యుత్ యూనిట్ల వినియోగం తరువాత ఆటోమేటిక్‌గా విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. కాబట్టి సెల్‌ఫోన్ రీఛార్జి మాదిరిగా వినియోగదారుల నుంచి ముందస్తుగా మూడు నెలలు, ఆరుమాసాల ఆఫర్లు పెట్టి జనం నుంచి అడ్వాన్సులు వసూలు చేసే పరిస్థితి వస్తుంది. ఇప్పటి వరకు సుమారు 300కార్యాలయాలకు స్మార్ట్‌మీటర్లు అమర్చినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ విధానం క్రమంగా అన్ని కేటగిరీ సర్వీసుల్లోనూ అమలు కానుంది. ముఖ్యంగా గృహ వినియోగదారులపై ఆర్థిక భారం పడడంతోపాటు, ప్రైవేటు పరిశ్రమల మనుగడకు ఇబ్బంది కలుగుతుంది. ట్విమ్స్ మిషన్ల అమలు తరువాత ఆర్‌టిసిలో కండక్టర్ ఉద్యోగాలు తగ్గి, ఇతర ఉద్యోగాలు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మాదిరిగా మారిపోయినట్టు, విద్యుత్ రంగంలోని ఈ సంస్కరణల వల్ల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో పాలిటెక్నిక్, ఐటిఐ వంటి అర్హతలతో పనిచేస్తున్న స్కిల్డ్, సెమీస్కిల్డ్ ఉద్యోగాలు గల్లంతవుతాయి. ఈ రంగంలో భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి కల్పన, రిజర్వేషన్లు అమలు వంటివి కూడా కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరోవైపు క్రమంగా రైతులు కూడా ప్రీపెయిడ్ చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. మరోవైపు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ద్వారా వినియోగదారులు ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ వస్తుసామగ్రి డేటాను సేకరించి ప్రైవేటు పెట్టుబడిదారులకు కట్టబెట్టే అవకాశాలు లేకపోలేదు. తద్వారా వినియోగదారులకు అవసరమైన ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్ చేసు కునేందుకు వెసులుబాటు కలుగుతుంది. ఈ విధానం వల్ల పెట్టుబడిదారులు లాభాలు పొందంతోపాటు ఉన్న ఉద్యోగాలకు ఎసరు వస్తుందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.



గురజాడ గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

డివైఎఫ్‌ఐ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రంలోని గురజాడ గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో మంగళవారం గ్రంథాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం గ్రంథాలయ కార్యదర్శి బి.లక్ష్మికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన గ్రంథాలయానికి సుమారు 400 మంది విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారని, వారికి సరిపడా వసతులు, మరుగుదొడ్లు కూడా అరకొరగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోవడం వల్ల, దోమలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం కాంపిటేటివ్‌కు సంబంధించి బుక్స్ అందుబాటులో తీసుకు రావాలని కోరారు. గ్రంథాలయ భవనంస్లాబ్ పెచ్చులూడిపోవడంతో మరమ్మతులు చేపట్టాలన్నారు. లేని పక్షాన ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పి. తవిటి నాయుడు, శ్రీను, కిరణ్ కుమార్, తరుణ్, తోపాటు నిరుద్యోగులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భారీ వర్షాలు

వరద ప్రమాదాన్ని ముందే గుర్తించాలి : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 5 నుంచి 7వ తేదీవరకు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని, బంగాళాఖాతంలో మరో అల్పపీడనం కూడా ఏర్పడే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. వరదలు సంభవిస్తే ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, తాహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఇరిగేషన్ ఇంజనీర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నదులు, రిజర్వాయర్లలో నీటి ప్రవాహ పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మడ్డువలస రిజర్వాయర్‌లో ఇన్‌ఫ్లో ఇప్పటికే ఎక్కువగా ఉందని, అందువల్ల ఇప్పటినుంచే అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మడ్డువలస ప్రభావిత గ్రామాల్లోనే విఆర్‌ఒలు రాత్రీపగలూ ఉండి, ఇరిగేషన్ అధికారులను ప్రతీ మూడు గంటలకోసారి సంప్రదించి రిజర్వాయర్ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను తెలుసుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రాలను కూడా ముందుగానే గుర్తించాలని చెప్పారు. ఛత్తీస్‌ఘడ్, ఒడిషా రాష్ట్రాల్లో భారీ వర్షాలు ఉన్నాయని, రానున్న రెండుమూడు రోజుల్లో నాగావళి నదిలో, తద్వారా తోటపల్లి కాలువల్లో ప్రవాహం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా వంగర, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి మండలాల్లోని 30 గ్రామాలపై దీని ప్రభావం ఉంటుందని చెప్పారు. ఆంధ్ర, తాటిపూడి రిజర్వాయర్లలో నీటి నిల్వ పరిస్థితిపై ఆరా తీశారు. ప్రస్తుతానికి ఈ రెండు రిజర్వాయర్లలో ప్రమాద పరిస్థితులు లేనప్పటికీ, భవిష్యత్తులో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఆయా గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, ప్రజారోగ్యంపై దష్టి పెట్టాలని ఎంపిడిఓలను ఆదేశించారు. రిజర్వాయర్ల ప్రభావిత ప్రాంతాల్లోని విఆర్‌ఒలంతా వారి గ్రామాల్లోనే ఉండి నిరంతరం ప్రవాహాల పరిస్తితులను తెలుసుకొని ప్రజల్ని అప్రమత్తం చేయాలని సూచించారు. ఒకవేళ వరద పరిస్థితి వస్తే, దానిని కనీసం ఒక రోజు ముందుగానే అంచనా వేసి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ ఎస్‌డి అనిత పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

మడ్డువలసకు తగ్గని వరద ఉధృతి

ప్రజాశక్తి-వంగర

మండలంలోని మడ్డువలస ప్రాజెక్టుకు సువర్ణముఖి వేగవతి నదుల నుంచి వరద ఉధృతి గత రెండు రోజులుగా ఏమాత్రం తగ్గలేదు. సోమవారం 7721 క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా, మంగళవారం నాటికి 7810 క్యూసెక్కుల నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు వద్ద 64.05 లెవెల్ నీటిమట్టం నమోదయినట్లు ప్రాజెక్ట్ ఎఇ కె.నితిన్ కుమార్ తెలిపారు. వంగర మండలంలో గత రెండు రోజులుగా వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలు కారణంగా సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మరోవైపు ఈనెల 6 7 తేదీల్లో



తుపాను హెచ్చరికల నేపథ్యంలో నదీ తీర గ్రామాలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు ప్రాజెక్టు అధికారులు ఐదు గేట్లను ఎత్తివేసి 7200 క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచిపెడుతున్నారు. మరో 610 క్యూ సెక్కుల నీటిని ప్రాజెక్టు ఆయికట్టుకు విడిచి వదులుతున్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

పనుల్లో నాణ్యతా లోపాన్ని సహించేదిలేదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాన్ని సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య స్పష్టం చేశారు. మంగళవారం వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న కాలువలు, కల్వర్టులు, రహదారుల మరమ్మతు పనులను పరిశీలించారు. నెహ్రూ పార్క్ లో ఏర్పాటు చేసిన బోరును పరిశీలించారు. కార్యక్రమంలో ఇఇ కె.శ్రీనివాసరావు, డిఇలు అప్పారావు, ఎఇలు వెంకటేశ్వరరావు, పార్వతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దబ్బిరాజుపేటలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన మండల ప్రధాన కార్యదర్శి శానాపతి వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 20మంది జనసైనికులు యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్ల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్ ఎస్ఎన్‌వి సత్యనారాయణ, గ్రామ పెద్దలు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మెనూ అమలుపై దృష్టి పెట్టాలి : కలెక్టర్

మధ్యాహ్న భోజన పథకంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం రుచిగాను, పోషక విలువలతో కూడినదిగానూ ఉండాలని, అందుకోసం మెనూ ఎలా ఉంటే బాగుంటుందో చర్చించి ప్రతిపాదనలు పంపిస్తే ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పై ఎంఇఒలకు, పాఠశాల నిర్వహణా కమిటీలకు, హెచ్.ఎం లకు, భోజన నిర్వాహకులకు కలెక్టరేట్ ఆడిటోరియం లో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల వారీగా మెనూ తయారు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని , మన జిల్లా కు సరిపోయే మెనూ ను రూపొందించడానికే ఈ కార్యక్రమమని తెలిపారు. పిల్లలు కడుపు నిండితే ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యంగా ఉంటే చదువుపై దృష్టి పెడతారని, అందరి అభిప్రాయంతో కొత్త మెనూను తయారు చేయాలని తెలిపారు. పిల్లలు ఇష్టంగా తినేవి, ఆరోగ్యాన్ని పెంపుదల చేసేవి మెనూలో ఉండాలని అన్నారు. మధ్యాహ్న భోజనంలో 16 రకాల వంటకాలను అందజేస్తామని, వారంలో 5 రోజుల పాటు గుడ్డు పెడుతున్నామని , 3 రోజులు వేరుసెనగ చిక్కీలను , 3 రోజులు రాగి జావ ను ఇస్తున్నామని వీటిని కొనసాగిస్తూనే ఇంకా పోషకాలతో కూడిన ఆహారాన్ని మెనూ లో చేర్చాలని తెలిపారు. 5 రోజులు గుడ్డు ఇస్తున్నప్పటికీ ఒక్క రోజే కూర రూపంలో , మిగిలిన 4 రోజులు ఉడకబెట్టిన గుడ్డు ను ఇస్తున్నామని, అలా కాకుండా 3 రోజులు కూర రూపం లో ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారని పలువురు వంట నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వసతి గృహాలకు ఇచ్చే బియ్యం మంచి వెరైటీ సరఫరా చెయ్యాలని ఇప్పటికే పౌర సరఫరాల శాఖ వారికీ ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వంటి ఛార్జీలు పెంచాలని నిర్వాహకులు కోరారు. పెంపుదల విషయం ప్రభుత్వ పరిశీలన లో ఉందని కలెక్టర్ తెలిపారు. పప్పు, నూనె ప్రభుత్వమే సరఫరా చేస్తే బాగుంటుందని హెచ్‌ఎంలు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. వంట గదులు, వంట పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలని, కట్టెల పొయ్యి మీద వంట చేయవద్దని కలెక్టర్ సూచించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు మధ్యాహ్న భోజన పథకాన్ని నిత్యం తనిఖీ చేయాలని తెలిపారు.సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి ఎన్. ప్రేమ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ఎయిర్‌పోర్టు పైప్‌లైన్ ఏర్పాటుకు భూసేకరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి నీటిని అందించేందుకుగాను వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేయడానికి భూ సేకరణ కోసం సంబంధిత రైతులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చర్చించారు. దీనికోసం భోగాపురం మండలం కోట భోగాపురం, నందిగాం గ్రామ రైతులతో తమ ఛాంబర్‌లో మంగళవారం సాయంత్రం కలెక్టర్ చర్చలు జరిపారు. ఈ పైప్‌లైన్ నిర్మాణానికి సుమారు 13 మంది రైతులనుంచి 33 సెంట్ల భూమిని సేకరించేందుకు అధికారులు నిర్ణయించారు. విస్తత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ భూమిని సేకరిస్తున్నామని, ఇప్పటికే పారమ్ సి నోటీసు జారీ చేశామని తెలిపారు. సెంటుకు రూ.20వేలను రైతులకు పరిహారంగా ఇవ్వాలని కలెక్టర్ నిర్ణయించారు. ఈ చర్చల్లో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, తాహశీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

నైతిక విలువలను అలవర్చుకోవాలి

బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు అలవర్చుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. మంగళవారం దాసన్నపేటలో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు పదో తరగతి కీలకమని, వారి బంగారు భవిష్యత్తుకు పునాది వంటిదని తెలిపారు. సెల్ ఫోన్లకు, చెడు స్నేహాలకు, దురలవాట్లుకు దూరంగా ఉండాలని, ఒక లక్ష్యం ఏర్పరచుకొని దానిని సాధించే దిశగా అడుగులు ముందుకు వేయాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై విద్య, విద్యార్థుల రక్షణ, భద్రత గురించి చేపట్టాల్సిన చర్యలపై వివరించారు.కార్యక్రమంలో ఎంఇఒ సత్యవతి, హెచ్‌ఎం రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

పోలీసుశాఖలో పని చేసి, ఇటీవల మరణించిన కానిస్టేబుళ్లు, హోంగార్డు కుటుంబాలకు 'చేయూత'ను అందించేందుకు సిబ్బంది అందజేసిన ఒక్కరోజు అలవెన్సును వారి కుటుంబ సభ్యులకు ఎస్‌పి వకుల్ జిందాల్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా పని చేస్తూ, మరణించిన ఎస్.చిన్నోడు కుటుంబానికి 'చేయూత'గా రూ.3,25,890 చెక్కును ఆయన సతీమణి ఎం.రజనికి ఎస్‌పి అందజేశారు. కానిస్టేబులుగా పని చేస్తూ, అనారోగ్య కారణాలతో మరణించిన పి.గౌరీ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.లక్ష చెక్కును వారి సతీమణి టి.ఇందిరా వసంతికి అందజేశారు. హోంగార్డు సతీమణి రజనికి ఇప్పటికే హోంగార్డు ఉద్యోగం ఇచ్చామన్నారు. గౌరీ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం నుండి రావల్సిన రాయితీలను సకాలంలో వచ్చే విధంగా చర్యలు చేపట్టడంతోపాటు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకుప్రతిపాదనలు పంపుతామని ఎస్‌పి తెలిపారు. ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, ఆఫీసు సూపరింటెం డెంట్ ఎ.ఎస్.వి. ప్రభాకరరావు, ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుకు 17 వరకు గడువు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2024-25 విద్యా సంవత్సరంలో డిసెంబర్ 8న జరుగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు గడువును ఈనెల 17వరకు పొడిగించారని డిఇఒ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో గత నెల 5నుంచి అందుబాటులో ఉందని తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలలో 8వ తరగతి చదువుతూ, కుటుంబ సంవత్సర ఆదాయం రూ. 3.50లక్షలు లోపు ఉన్న విద్యార్థులంతా పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. పరీక్ష రుసుం ఒసి,బిసి విద్యార్థులకు రూ.100, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు రూ.50 అని తెలిపారు.

గిరిజన గ్రామాన్ని అప్రమత్తం చేసిన తహశీల్దార్

రేగిడి: మండలంలోని గదబపేట గిరిజన గ్రామాన్ని తహశీల్దార్ డి. ఎల్లారావు తుపాను వరద కారణంగా మంగళవారం అప్రమత్తం చేశారు. తుపాను వర్షాలకు ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షాలకు మడ్డువలస ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో నాగావళి నది ఉధృతి పెరగింది. దీంతో గిరిజన గ్రామంలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. నాగావళి వరద ఉధృతి పెరిగితే పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచించారు. ఆయనతో పాటు విఆర్ఒ పట్టాభి, విఆర్ఎలు రాజు, సత్యనారాయణ తదితరులున్నారు.

సపోర్టర్స్ మీట్‌లో శారద

బొబ్బిలి : శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆత్మకూరు శంకరరావు జయంతి సందర్భంగా విశాఖపట్నంలో జరిగిన సపోర్టర్స్ మీట్ కార్యక్రమంలో అభ్యుదయ ఫౌండేషన్ అధ్యక్షులు, ప్రపంచ మానవ హక్కుల సంఘం సౌత్ ఇండియా మహిళా అధ్యక్షులు డాక్టర్ చింత శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ ద్వారా నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామని కంటి సంబంధిత రోగులకు అద్భుతంగా సేవలు అందిస్తున్నారని చెప్పారు. జియం రాధాకృష్ణ చేతుల మీదుగా బెస్ట్ సపోర్టర్స్ అవార్డ్‌ను ఆమె అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల సంఘం సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మన్యం ధీరుడు' వాల్ పోస్టర్ విడుదల

బొబ్బిలి: మన్యం వీరుడు సీతారామరాజు జీవిత చరిత్రను ప్రజలకు చెప్పేందుకు చిత్రీకరించిన మన్యం ధీరుడు సీతారామరాజు చిత్రం వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే బేబినాయన మంగళవారం కోటలో విడుదల చేశారు. ముందుగా చిత్రం ట్రైలర్‌ను హీరో, నిర్మాత ఆర్.వి.వి సత్యనారాయణతో కలిసి బేబినాయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను నేటి తరానికి చెప్పేందుకు మన్యం ధీరుడు సీతారామరాజు చిత్రాన్ని చిత్రీకరించడం అభినందనీయమన్నారు. చిత్రంలో జబర్దస్త్ ఆర్టిస్టులు అప్పారావు, సత్తిపండుతో పాటు దేశ రక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న ఆర్మీ జవాన్లు నటించినట్లు నిర్మాత సత్యనారాయణ చెప్పారు. ఈనెల 20న తెలుగు రాష్ట్రాలలో సినిమా విడుదల చేయనున్నట్లు చెప్పారు. చిత్రానికి డెక్కల నరేష్ దర్శకత్వం వహించగా సంగీతాన్ని పవన్ సమకూర్చినట్లు చెప్పారు.

వారికి నోటీసులివ్వండి

బొబ్బిలి: రోడ్లపై పశువులు కడుతున్న వారిని గుర్తించి నోటీసులు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని మంగళవారం కోరాడవీధి, శ్రీరామ్ నగర్ కాలనీ, పాకీవీధి, తారకరామకాలనీ, స్వామివారివీధి ప్రాంతాలలో పర్యటించారు. శ్రీరామనగర్ కాలనీ, పాకీవీధి ప్రాంతాలలో రోడ్లపై పశువులు కట్టడంతో అపారిశుధ్యం పేరుకుపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై పశువులు కడుతున్న వారికి నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తారకరామ కాలనీ సమీపంలో ఉన్న లేఅవుట్‌ను పరిశీలించారు. లేఅవుట్‌కు అనుమతులు ఉన్నాయో లేవో చూడాలని టిపిఒ వరప్రసాద్‌ను ఆదేశించారు. మళ్ళమ్మ చెరువు చుట్టూ పచ్చదనం పెంపొందించాలని కోరారు. ఆమెతో మున్సిపల్ ఇంజినీరింగ్, శానిటేషన్ ఉద్యోగులు ఉన్నారు.

మున్సిపల్ నీరు సురక్షితమేనా?

బొబ్బిలి: మున్సిపల్ ప్రజలకు ఇస్తున్న తాగునీరు సురక్షితమేనా అని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.శంకరరావు ప్రశ్నించారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ ట్యాంకు శుభ్రం చేయలేదని మున్సిపల్ కో-అప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు ఆరోపిస్తే షెడ్యూల్ ప్రకారం ట్యాంకు శుభ్రం చేస్తున్నామని మున్సిపల్ అధికారులు చెప్పడం చూస్తే ఎవరు మాటలు నిజమో ప్రజలకు తెలియడం లేదన్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు సురక్షితమైన తాగునీరు ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. దోమలను నివారించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ నాయకులు జి. గౌరీ, బి. వెంకటి, శివ, ఏడుకొండలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

గరివిడి : ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి మల్లిక్ నాయుడు అన్నారు. మండలంలోని జి.బొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు తదితర వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆశా వర్కర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆశావర్కర్లు ఆరోగ్య రక్షకులని, వారి సేవలు మరువలేనివని, కరోనా మహమ్మారి విజృంభించిన విపత్కర పరిస్థితుల్లో ఆశా వర్కర్లు గ్రామాలలో చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఆశాలకు అండగా ఉంటుందని అన్నారు.

పొలంబడి ద్వారా రైతులకు అవగాహన

శృంగవరపుకోట: వరి పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి చర్చించి పొలంబడి ద్వారా అవగాహన కల్పించామని ఎఒ కె.రవీంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని వసి గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని వరిలో విత్తన శుద్ధి, ప్రాముఖ్యత, నారు యాజమాన్యం, కాలిబాటల గురించి వివరించారు. ఎరువుల మోతాదు తగ్గించుకోవడం కోసం పచ్చిరొట్ట ఎరువులు అందరూ తప్పనిసరిగా వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎ వివేక్, రవి, ఏ. సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డి కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి:ఆర్‌డిఒ

చీపురుపల్లి: ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చీపురుపల్లి రెవెన్యూ డివిజినల్ అధికారిని బి.శాంతి అన్నారు. వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌విఆర్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆర్‌డిఒ ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో 29 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ శాఖ అధ్యక్షుడు గవిడి నాగరాజు, వగరపు సంతోషి, కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ, అధ్యాపకులు, మానవీయత సంస్థ అధ్యక్షుడు బివి గోవిందరాజులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ చోరీ

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎన్‌సిఎస్ చక్కెర కర్మాగారానికి అనుబంధంగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఉన్న మెయిన్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కాపర్ చోరీకి గురైంది. 2006లో రూ.4కోట్లు విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి యాజమాన్యం ఏర్పాటు చేసింది. 2021 నుంచి పరిశ్రమ మూత పడడంతో పరిశ్రమలో ఉన్న ప్రధాన పార్టులు చోరీకి గురవుతున్నాయి. 133కెవి మెయిన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ఓపెన్ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న 14వేల లీటర్ల ఆయిల్‌ను చోరీ చేసి రూ. కోటికి పైగా విలువ చేసే కాపర్ వైర్‌ను ఎత్తుకు పోయారు. లీటర్ ఆయిల్ రూ.500 ధర పలుకుతుందని అంచనా వేస్తున్నారు. చక్కెర పరిశ్రమ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఎన్.సి.ఎల్.టి కోర్టులో ఉంది. పరిశ్రమ ఆస్తులు కోర్టులో ఉండడంతో కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు కూడా కోర్టు పెండింగులో ఉన్నాయి. ఆస్తులు ఒకొక్కటి చోరీకి గురికావడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పరిశ్రమ ఆస్తులను కాపాడాలని, చోరిపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

నాటు సారా తయారీపై దాడి

ప్రజాశక్తి - వంగర

నాటు సారా తయారీ బట్టీలపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. మండలంలోని జెకె గుమ్మడలో 1000 లీటర్ల నాటు సారా తయారీ బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. పోలీస్ సిబ్బంది పోలి నాయుడు, కుర్మినాయుడు, కళారావు పాల్గొన్నారు.

అదృశ్యం కేసు నమోదు

రేగిడి: మండలంలోని బాలకావివలస గ్రామానికి చెందిన కోడిశ సూర్యనారాయణ(65) అదృశ్యమైనట్లు హెచ్‌సి రాజారావు మంగళవారం తెలిపారు. గత నెల 24న అనారోగ్యం కారణంగా ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేసుకుని వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు సూర్యనారాయణ కుమారుడు ప్రసాదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మత్స్యకారులకు సబ్సిడీపై బోట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ



వినతినిస్తున్న మత్స్యకారులు

తీరంలో మత్స్యకారులకు సబ్సిడీపై వలలు, బోట్లు లైఫ్ జాకెట్లు ఇవ్వాలని మండలంలోని తిప్పవలస మత్స్యకారులు మంగళవారం మత్స్యశాఖ అధికారికి వినతి అందించారు. మండలంలోని తిప్పలవలసలో జనసేన మండల కోఆర్డినేటర్ గుడివాడ జమరాజు ఆధ్వర్యంలో మత్స్యశాఖ అధికారి చాందినితో మత్స్యకారులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు వచ్చేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మన్నారు. మత్స్యకారులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సబ్సిడీపై పరికరాలు ఇవ్వాలని కోరారు. తుపాను వచ్చే సమయంలో సముద్రం వచ్చి ఊరు మీద పడుతుందని రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరారు. ఫ్లోటింగ్ జట్టిగాని రాతి గట్టు గాని నిర్మాణం చేయాలని కోరారు. సమావేశంలో మత్స్యకార నాయకులు ముగిసిన్నయ్య, వాసుపల్లి అప్పన్న, వాసుపల్లి కన్నయ్య తాత పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించండి

ప్రజాశక్తి- గజపతినగరం



ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు వి. లక్ష్మి

మండలంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఆరు నెలల వరకు జీతాలు బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే చెలించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్ని నెలల నుంచి బకాయిలు ఉంటే వాళ్ల కుటుంబాలని ఏ విధంగా పోషించుకుంటారన్నారు. ఒకవైపు పిల్లలు చదువులకి, వైద్య ఖర్చులకి, తిండికి అప్పులు చేసి జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి గ్రీన్ అంబాసిడర్లకి నెలల జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని అందరికీ జీతాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల మండల కార్యదర్శి కె.రాము, అధ్యక్షుడు డి. అప్పన్న, బి. శ్రీను, సీతయ్య, అప్పలస్వామి, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషకాహార వారోత్సవాలు

ప్రజాశక్తి - కొత్తవలస

కాటకాపల్లి అంగనవాడీ కేంద్రం పరిధిలో పోషకాహార వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో అంగన్వాడి సూపర్‌వైజర్ కె.రవణమ్మ మాట్లాడుతూ ఈ వారోత్సవాలు సెప్టెంబర్ నెలంతా నిర్వహిం చాలన్నారు. గర్భిణిలకు, బాలింతలకు పోషకాహారం అందించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరి ంచారు. గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలు బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు తీసుకునే ఆహారంలో కూరగాయలు, పప్పులు, పండ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు, మహిళా పోలీసు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని శివడవలస గ్రామంలో పోషకాహర మాసోత్సవాలు మంగళవారం అంగన్వాడీ సెంటర్‌లో నిర్వహించారు. తల్లులకు రక్తహీనంత రాకుండా తీసుకోవలసిన పోషకాలు ఉన్న ఆహార పదర్థాలు, చిరుధాన్యాలతో వంటల ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంగల లక్ష్మి రాణి, హెచ్ఎం విజయకుమార్, సచివాలయ సిబ్బంది, అంగన్‌శాడీలు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ర్యాలీ

చీపురుపల్లి: స్థానిక మూడు రోడ్ల కూడలిలో మంగళవారం డ్రగ్స్‌కి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ స్టూడెంట్స్ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వ్యతిరేక స్లోగన్స్‌ని ప్లకార్డులతో ప్రదర్శించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ డ్రగ్స్‌కి అలవాటు పడి విద్యార్థులతో యు వత వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. యువతను చైతన్యం చేసేందుకు మండల స్థాయిలో ర్యాలీలు చేపట్టామన్నారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో జిల్లా ప్రధాన కేంద్రంలో అవగాహనా కార్యక్రమం ఉంటుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం వెంకి, రూప, రమణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి'పై ఎమ్మెల్యే చర్చ

ప్రజాశక్తి - కొత్తవలస



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

బాబు జగజ్జీవన్‌రావు ఉత్తరాంధ్ర సుజుల స్రవంతి ప్రాజెక్ట్ లెఫ్ట్ కెనాల్ పనులలో భాగంగా భూముల సమీకరణపై ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మంగళవారం అధికారులు, నియోజకవర్గ రైతులతో తన నివాసంలో చర్చించారు. ఈ పనులు త్వరితగతిన పూర్తవడానికి గల అవకాశాలను అధికారులకు వివరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.మురళీకృష్ణ, స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్ పి.రమేష్, గజా కంపెనీ డిజిఎం కె.సతీష్, డిఇ బి. లక్ష్మి సుధా, ఎస్‌కోట టిడిపి మండల అధ్యక్షులు ఎస్ నాయుడు, మాజీ ఎంపిపి కొల్లి రమణమూర్తి, ఎల్.కోట టిడిపి మండల అధ్యక్షులు చొక్కాకుల మల్లునాయుడు, ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, కోన సత్యం, డెక్క దేముడు నాయుడు, పిన్నింటి రమేష్, పిల్లా అప్పలరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - నెల్లిమర్ల



ఆపరేషన్ తరువాత రోగి

మిమ్స్ ఆసుపత్రిలో మెడ వెన్నుకు అరుదైన శస్త్ర చికిత్స మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. కె.వరహాలమ్మ అనే 70 సంవత్సరాల మహిళ తన ఇంటి వద్ద పడిపోవటం వల్ల మెడ వెన్ను ఎముక విరిగిపోయింది. ఈ ప్రమాదంలో బాధితురాలికి సి1, సి2, ట్రౌమాటిక్ సబ్లక్షటేషన్ విత్ కోర్డ్ కంప్రెషన్ కారణంగా మెడ నొప్పి, రెండు కాళ్ళు చేతులు చచ్చు పడిపోయి వీల్ చైర్‌లో మిమ్స్ హాస్పిటల్‌కి తీసుకొచ్చారు. మిమ్స్ స్పైన్ సర్జరీ విభాగం వైద్యులు (న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్) ఎనస్థిసియా వైద్యులు ఆధ్వర్యంలో అతి క్లిష్టమైన, అరుదైన సి1, సి2 డికంప్రెషన్, పోస్టీరియర్ ఫిక్సేషన్ శస్త్ర చికిత్స చేసి వెన్నును సరిచేశారు. ప్రస్తుతం బాధితురాలు ఇప్పుడు వాకర్ సహాయంతో నడుస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఇటువంటి శస్త్రచికిత్స మొదటిసారిగా మిమ్స్ హాస్పటల్ జరిగింది. ఈ ఆపరేషన్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎనస్తీయా బృందం సహకారంతో డాక్టర్ సావంత్ కొత్త, డాక్టర్ ఈశ్వర రావు (న్యూరో సర్జన్) డాక్టర్ టి. యశ్వంత్ (స్పైన్ సర్జరీ) తదితర వైద్య బృందం చేసినట్లు చెప్పారు.

నేత్ర దానంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- దెంకాడ



ర్యాలీ చేస్తున్న సిబ్బంది

39వ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా మండలంలోని మోపాడ పిహెచ్‌సిలో నేత్ర దానం విశిష్టతను తెలుపుతూ మంగళవారం అవగాహన ర్యాలీని చేపట్టారు. అనంతరం అప్తాల్మిక్ ఆఫీసర్ మజ్జి గణపతిరావు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి, జిల్లా ఎయిడ్స్, క్షయ లెప్రసి నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి మాట్లాడుతూ నేత్రదానం ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా, కుటుంబ సాంప్రదాయంగా గుర్తించి, నేత్రదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. మరణానంతరం ఒక్కరు చేసే నేత్రదానం ఇద్దరి అంధులకు చూపు నిస్తుందని నేత్ర దానంపై ప్రజలలో అపోహలను తొలగించి, అవగాహన కలిగించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రతీ సంవత్సరం ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు ప్రభుత్వం నేత్రదాన ప్రచార పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మోపాడ వైద్యాధికారి డాక్టర్ యోగితా బాల మాట్లాడుతూ మరణించిన వ్యక్తి నుంచి 6 గంటలలోపు నేత్రాలను సేకరించాలని, నేత్రదానం చేయడానికి స్త్రీ పురుష వయోభేదం లేదన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి సిహెచ్ సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఎస్. సూరిబాబు, వైద్యసిబ్బంది గున్నమ్మ, రహమతుణ్ణీసా, రమణమ్మ, మహేశ్వరి,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నమోదు చేసుకున్న వాహనాలకే ఇసుక రవాణా

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో వినియోగదారులకు ఉచిత ఇసుకను రవాణా చేయదలచిన వాహన యజమానులంతా తమ వాహనాలను రవాణా శాఖ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవలసి ఉంటుందని ఉప రవాణా కమిషనర్ మణికుమార్ చెప్పారు. ఆ విధంగా నమోదు చేసుకున్న వాహనాలకే ఇసుక రవాణాకు అవకాశం వుంటుందన్నారు. జిల్లాలోని ఇసుక రవాణాచేసే వాహన యజమానులతో మంగళవారం రవాణా శాఖ కార్యాలయంలో ఉపరవాణా కమిషనర్, గనులశాఖ జిల్లా అధికారి సిహెచ్.సూర్యచంద్రరావు సమావేశం నిర్వహించారు. ఉచిత ఇసుక రవాణాకు సంబంధించి ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలపై వారికి వివరించారు. ఇసుక రవాణాకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలను కూడా వారికి తెలియజేసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఇసుక రవాణాకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను రవాణాదారులంతా పాటించి వినియోగదారులకు ఉచిత ఇసుకను సులభతరంగా అందించడంలో సహకరించాలని గనులశాఖ అధికారి సూర్యచంద్రరావు కోరారు.

సత్య కళాశాలలో మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం

వినాయక చవితి నేపథ్యంలో సత్య కళాశాలలో మంగళవారం ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశిభూషణరావు సుమారు 500 విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి, కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎన్‌సిసి ఆఫీసర్ బి.సూరపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు మీటర్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



దరఖాస్తు ఇస్తున్న శంకరరావు, లబ్ధిదారులు

విజయనగరంలో హుదూద్ బాధితులకు లంకా పట్నంలో నిర్మించిన ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని హౌసింగ్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన ధర్నాకు అధికారులు స్పందించారు. కరెంట్ మీటర్లు వేస్తాం దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు ఆధ్వర్యాన 90 మంది బాధితులు తమ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఎడికి అందజేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న హుదూద్ బాధితులకు ఇళ్లను అప్పగించడం లేదని, చివరికి సిపిఎం ఆధ్వర్యాన 2023 నవంబర్ లో 290 మందిని ఇళ్లల్లో దించిందని తెలిపారు. కానీ నివాసంలో ఉన్న వారికి కరెంట్, మంచినీరు, మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. వెంటనే సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, కార్యకర్తలు జగదాంబ, జగదీష్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

నెమలాంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని పెరుమాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ మనోజ్ఞ, డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం నెమలాం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని విష జ్వరాలు ప్రభలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని వారు తెలిపారు.

ఐటిఐ పరీక్షల అక్రమాలపై దర్యాప్తు

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వ ఐటిఐలో జరిగిన పరీక్షల అక్రమాలపై తహశీల్దార్ ఎం.శ్రీను దర్యాప్తు చేశారు. గతనెల 22 నుంచి 30 వరకు జరిగిన పరీక్షలలో అక్రమాలు జరిగినట్లు ప్రజాశక్తిలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు స్పందించి సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని తహశీల్దార్ ఎం.శ్రీను ఆదేశించడంతో మంగళవారం ఐటిఐకు వెళ్లి దర్యాప్తు చేశారు. విద్యార్థులు, ఉద్యోగులను వేర్వేరుగా విచారించారు. దర్యాప్తు నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని తహశీల్దార్ తెలిపారు.

సముద్రతీరంలో రెండు రోజులు సాగర్ కవాచ్

ప్రజాశక్తి - భోగాపురం

తీర ప్రాంత రహదారుల నుంచి వచ్చే ప్రతి ఒక్కరిని జంక్షన్లు వద్ద తనిఖీలు చేయాలని విజయనగరం డిఎస్‌పి గోవిందరావు అన్నారు. సముద్ర తీరంలో సాగర్ కవాచ్ కార్యక్రమాన్ని నేటి నుంచి రెండు రోజులు పాటు నిర్వహిస్తామన్నారు. సముద్రతీరం నుంచి చొరబాట్లు జరిగేటప్పుడు వారిని ఎలా తట్టుకోవాలనే దానిపై ప్రతి ఏడాది సాగర కవచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా హాజరైన సిబ్బందికి డి.ఎస్.పి సూచనలు సలహాలు అందజేశారు. మెరైన్ సీఐ వైకుంఠ రావు మాట్లాడుతూ భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో తీర ప్రాంత గ్రామాల నుంచి వచ్చే జంక్షన్‌ల వద్ద విస్తృతంగా తనిఖీలు చేస్తామన్నారు. ఇందుకోసం 200 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. సీఐలు ప్రభాకర్ రావు, రామకృష్ణ, నాలుగు మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

తూడెం పాఠశాలకు స్పోర్ట్స్ కిట్ అందజేత

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని తూడెం ఉన్నత పాఠశాలకు దివీస్ ఫార్మా కంపెనీ సాఫ్ట్ బాల్ స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.అప్పన్నకు ఆ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ సురేష్ మంగళవారం అందజేశారు. ఇటీవలి జరిగిన క్రీడా దినోత్సవం సందర్భంగా దీనిని అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పన్న తెలిపారు. ఈ క్రీడా సామగ్రి మొత్తం విలువ రూ. 2.25 లక్షలు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

దోమల వ్యాప్తి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని జోనల్ మలేరియా ఆఫీసర్ ఎం.శాంతి ప్రభ అన్నారు. ఆశా డే సందర్భంగా మంగళవారం మండలంలోని కొట్టాం పిహెచ్‌సి ఆవరణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మట్లాడారు. జనవరి నెల నుంచి సెప్టెంబర్ వరకు కొట్టం పిహెచ్‌సి పరిధిలో 194 మలేరియా కేసులు నమోదయ్యాయని మిగతా పిహెచ్‌సిల కంటే ఇక్కడ చాలా ఎక్కువ కేసులు నమోదయ్యాయని ఈ కేసులను తగ్గించి దోమల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. ఆగస్టు నుంచి నవంబర్ వరకు మలేరియా డెంగీలకు సీజన్ అయినందు వల్ల దోమల వృద్ధిని అరికట్టేందుకు ఈ నాలుగు నెలల్లో ఎక్కడ నీటి నిల్వలు ఉండకుండా చూడడం, అవసరమైన చోట యాంటీ లార్వాలను పిచికారి చేయటం చేయాలన్నారు. దోమల నివారణకు మెడికల్, పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి పరిధిలోని వైద్యులు, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.